క్లుప్తంగా

తహసీల్దార్‌గా శివ శ్రీనివాస్


శివ శ్రీనివాస్

కల్హేర్(నారాయణఖేడ్): స్థానిక తహసీల్దార్‌గా శివ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయనను నియమిస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వర్లు డిప్యూటీ కలెక్టర్ క్యాడర్ అధికారి కావడంతో ఐదు నెలల శిక్షణలో భాగంగా తహసీల్దార్‌గా పనిచేశారు. వెంకటేశ్వర్లు శిక్షణ పూర్తి కావడంతో సీసీఎస్ఎల్ఏకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన శివ శ్రీనివాస్‌కు సిబ్బంది డేవిడ్, రాజు, రవి, సాయికుమార్, కార్తిక్ తదితరులు అభినందించారు.

సీఐగా బాధ్యతల స్వీకరణ



సీఐకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్‌ఐ

జహీరాబాద్: జహీరాబాద్ టౌన్ సీఐగా శివలింగం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్‌ఐ కాశీనాథ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సీఐగా పనిచేసిన ఆర్.రవి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో శివలింగం విధుల్లో చేరారు. ఈయన గతంలో టౌన్ ఎస్‌ఐగా కూడా పనిచేశారు.

రూరల్ సీఐగా హన్మంత్


హన్మంత్

న్యాల్‌కల్(జహీరాబాద్): జహీరాబాద్ రూరల్ సీఐగా జక్కుల హన్మంత్ నియమితులయ్యారు. ఇక్కడ సీఐగా పనిచేసిన నయీమొద్దీన్ హైదరాబాద్‌లోని ఐజీ కార్యాలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో అక్కడ పనిచేసిన హన్మంత్ బదిలీపై రూరల్ సీఐగా ఇక్కడకు వచ్చారు. శనివారం ఆయన విధుల్లో చేరారు.

స్పాట్ కౌన్సెలింగ్

హత్నూర(సంగారెడ్డి): స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు జోనల్ అధికారి భీమయ్య తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని 13 గురుకుల కళాశాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న 510 సీట్లను ముఖాముఖీగా భర్తీ చేసినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కాగా పదో తరగతిలో వచ్చిన మార్కుల గ్రేడింగ్ ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వివేకానంద, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా చిత్రీకరణ సంతోషకరం


కొమురయ్యను సన్మానిస్తున్న దశరథ్

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో సినిమాల చిత్రీకరణ సంతోషకరమని బీజేపీ మండల అధ్యక్షుడు సిందోల్ దశరత్ అన్నారు. ఓ సినిమాకు చెందిన సన్నివేశాలను నాలుగు రోజులుగా రుద్రారంలో చిత్రీకరించి శనివారం నుంచి అబ్బెందలో చిత్రీకరణ ప్రారంభించారు. ఈ సినిమాలో ఖేడ్ ప్రాంతానికి చెందిన పలువురు నటిస్తున్నారు. బలగం సినిమా ఫేమ్ కొమురయ్య ప్రధానపాత్ర పోషిస్తున్నారు. ఆయనను దశరత్ శాలువాతో సన్మానించారు.

ముస్లింల సమస్యలపై వినతి


వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

నారాయణఖేడ్: పట్టణంలో ముస్లింలకు సంబంధించిన వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక ముస్లిం యాక్షన్ కమిటీ బాధ్యులు ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటిక కోసం వక్ఫ్‌బోర్డు స్థలంలో మూడెకరాలు, ఈద్గా కోసం ఐదెకరాలను ఇప్పించాలని కోరారు. అలాగే బీఆర్ఎస్ నాయకుల కబ్జాలో ఉన్న షాదీఖానాను విడిపించాలని, ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కృషిచేయాలని పేర్కొన్నారు. సామాజిక భవనానికి స్థలం కేటాయించి భవనాన్ని నిర్మింపజేయాలని, ముక్కిడి పీర్లదర్గా భూమిని ఇప్పించాలని, పక్కా గృహాలు, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులను ఇప్పించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో తాహెర్‌అలీ, మొయినొద్దీన్ ఖురేష్, యూనూస్, దిల్‌దార్‌ఖాన్, యూసూఫ్, ఖయ్యూం, సుబూర్, దిన్‌దార్‌ఖాన్, ఫయాజ్ ఉన్నారు.


బీరంగూడ గుట్ట ఆలయానికి వెళ్లే రోడ్డులో నిలిచిన నీరు


గడ్డపోతారం పారిశ్రామిక వాడలో రోడ్డు దుస్థితి..

గోతులమయం.. సాగని పయనం

జిన్నారం మండలంలోని ఆయా గ్రామాలను కలుపుతున్న పలురోడ్లు పూర్తిగా ధ్వంసమై ప్రయాణించడానికి ప్రజలకు పాట్లు తప్పడంలేదు. పారిశ్రామిక వాడల రోడ్లు వర్షాల కారణంగా గుంతలమయంగా మారాయి. గడ్డపోతారం, బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల్లోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అలాగే శివానగర్ నుంచి చిన్నకంజర్ల వరకు ఉన్న రోడ్డు ధ్వసమైంది. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో రోడ్లు దారుణంగా మారాయి. మరమ్మతులకు మున్సిపల్ పాలకవర్గం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ సమావేశాల్లో తమ వార్డుల్లో ఉన్న పరిస్థితిని చర్చించినా ఫలితం లేకుండా పోతుంది అని కొందరు కౌన్సిలర్లు వాపోతున్నారు.

– జిన్నారం(పటాన్‌చెరు)/పటాన్‌చెరు


గుంతల మయంగా మారిన శివానగర్- చిన్నకంజర్ల రోడ్డు

బస్తీ దర్శన్‌తో సమస్యల పరిష్కారం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పాషాకాలనీలో శనివారం బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా కార్పొరేటర్ పుష్పనగేశ్ బస్తీ వాసుల సమస్యలను తెలుసుకున్నారు. కాలనీవాసులు మాట్లాడుతూ బస్తీలో ఉన్న ఓపెన్ డ్రైన్‌లో చెత్త పేరుకుపోయి వర్షపు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని వాపోయారు. వెంటనే ఓపెన్ డ్రైన్‌ను శుభ్రం చేయించాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. పాషా కాలనీ చుట్టూ ఉన్న ఫెన్సింగ్ కూలిపోవడంతో నూతన ఫెన్సింగ్ వేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆమె కాలనీలో ఆదివారం నిర్వహించనున్న బోనాల పండుగకు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- వీఓఏల సంఘం నేత నగేశ్


సమావేశంలో మాట్లాడుతున్న నగేశ్

జోగిపేట(అందోల్): ఐకేపీ వీఓఏలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నగేశ్ డిమాండ్ చేశారు. శనివారం మార్కెట్ కమిటీ హాలులో మండల అధ్యక్షుడు జి.మల్లయ్య అధ్యక్షతన వీఓఏల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. 20యేళ్లుగా మహిళా సంఘాలకు సేవలు అందిస్తున్నారని, మహిళాశక్తి కార్యక్రమంలో 23రకాల సేవలను మహిళలకు అందించడంలో విశేషంగా కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యాసాగర్, గొల్ల మల్లయ్య, ఆంజనేయులు, విజయ పాల్గొన్నారు.

ఘనంగా విద్యార్థుల బోనాల ఉత్సవాలు


జహీరాబాద్: పోతురాజుల వేషధారణలో విద్యార్థులు

జహీరాబాద్/జహీరాబాద్ టౌన్/ఝరాసంగం(జహీరాబాద్)/మునిపల్లి(అందోల్): ఆషాఢ మాసం సందర్భంగా వివిధ మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. జహీరాబాద్‌లోని శ్రీకృష్ణవేణి ఉన్నత పాఠశాలలో బోనాల ఉత్సవాలల్లో భాగంగా అమ్మవారిని అలంకరించి విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సవాల్లో పాల్గొన్నారు. పోతురాజు వేషధారణతో అందరినీ అకట్టుకున్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వెదిరె అశోక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గాజుల లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఝరాసంగం మండలంలోని విజ్ఞాన జ్యోతి మోడల్ స్కూల్‌లో విద్యార్థులు బోనాలు ఎత్తుకొని సందడి చేశారు. మునిపల్లి మండలం తాటిపల్లి, బుదేరాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో బోనాల కార్యక్రమం నిర్వహించారు. పోతురాజుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

పటాన్‌చెరు: విజిలెన్స్, రవాణాశాఖ అధికారులు ముత్తంగి సమీపంలో తనిఖీలు నిర్వహించారు. రసీదులు లేకుండా ఇసుక, రాయి ఇతర మెటల్ ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఎనిమిది వాహనాలను పట్టుకున్నామని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనరేజీ పన్ను కింద రూ.2.20లక్షలు జరిమానా విధించామని, సీజ్ చేసిన లారీలను తమ అధీనంలో ఉంచుతామని పేర్కొన్నారు. ఒక లారీ డ్రైవర్ లారీని వదిలిపెట్టి పరారయ్యాడని, ఆ వాహనాన్ని స్థానిక పోలీసులకు అప్పగించామని తెలిపారు.

ఇద్దరు అదృశ్యం


ప్రవీణ్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తన భర్త ఫోన్ ఇంట్లోనే ఉంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడని ఫిర్యాదు చేసిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని పటేల్‌గూడ లక్ష్మీనగర్‌కు చెందిన ప్రవీణ్ 24న సాయంత్రం తన ఫోన్‌ను ఇంట్లోనే ఉంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన భార్య స్వప్న బంధువుల ఇళ్లవద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సోదరి అదృశ్యంపై..

తన సోదరి అదృశ్యంపై ఫిర్యాదు చేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆసిఫ్ అలీ కథనం ప్రకారం ఆల్విన్ కాలనీకి చెందిన అరవింద్ సింగ్ కూతురు పాయల్ సింగ్ బీటెక్‌లో ఫెయిల్ కావడంతో ఇంటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో శనివారం ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉండడంతో ఆమె కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె సోదరుడు అమన్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.లక్ష ఎల్‌ఓసీ అందజేత

జహీరాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని బూచనెల్లి గ్రామానికి చెందిన ఆర్.నాగన్నకు శనివారం సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి రూ.లక్ష విలువగల ఎల్‌ఓసీ అందజేశారు. లివర్ వ్యాధితో బాధపడుతున్న అతడి వైద్యానికి లక్ష రూపాయలు అవసరమని వైద్యులు చెప్పారు. దీంతో అతడు గిరిధర్‌రెడ్డిని సంప్రదించాడు. ఆయన స్పందించి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో రూ.లక్ష ఎల్‌ఓసీ అందజేశారు.

ఉత్సాహంగా గోరింటాకు వేడుకలు


ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

జహీరాబాద్/జహీరాబాద్ టౌన్: పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో శనివారం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆషాఢమాసం గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా సంఘం నాయకులు గోరింటాకు సమకూర్చగా అధిక సంఖ్యలో తరలి వచ్చిన ఆడపచులు చేతులకు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గోరింటాకు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గౌరీదేవికి ఇష్టమైన గోరింటాకు పెట్టుకుంటే అమ్మవారి అనుగ్రహం కలుగుతుందని, ఆరోగ్యపరమైన సమస్యలు దూరమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు మారంవార్ కల్పన, ప్రధాన కార్యదర్శి మ్యాడం పద్మ, సలహదారులు బెజుగం ప్రమీల, నవనీత, సుప్రియ, లత, వీరమణి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షకార్యదర్శులు బెజుగం రాజ్‌గోపాల్, నామ రవికిరణ్‌లు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటుదాం

- డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి


న్యాల్‌కల్(జహీరాబాద్)సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్)/నారాయణఖేడ్/కల్హేర్(నారాయణఖేడ్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుపొందడం ఖాయమని డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని మామిడ్గి శివారులోని ఎస్ఎస్‌వీ హాల్‌లో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఓంకార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజల్లో బీజేపీకి మంచి ఆదరణ ఉందని, కేంద్రం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చునన్నారు. సమావేశంలో శివాజీ పాటిల్, మల్లేశ్ గంగ్వార్, పాండురంగారావు పాటిల్, బస్వరాజ్ పాటిల్, పాండురంగారెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఏక్‌నాథ్‌రావు పాటిల్, విజయ్ పాటిల్, వీరన్న, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తీసుకువెళ్లాలి

కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకువెళ్లి బీజేపీ బలోపేతం కోసం కృషి చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు పత్తిరి రామకృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరామ్ అన్నారు. నిజాంపేట్ మండల కేంద్రంలో శనివారం మండల పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీని బలోపేతం చేయాలన్నారు. పొట్టి కృష్ణ, కాశీనాథ్, అంజయ్య, రాజు, రవీందర్, అశోక్, విజయ్ కుమార్, రాములు, శ్రీనివాస్, జి.కృష్ణ, చిలకమ్మ, నర్సన్న, మల్లయ్యస్వామి, బీరప్ప తదితరులు పాల్గొన్నారు. సిర్గాపూర్ మండలం వాసర్‌లో నిర్వహించిన సమావేశంలో గోపాల్‌రెడ్డి మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ రాజు రాథోడ్, డివిజన్ కో కన్వీనర్ నగేశ్ యాదవ్, అరుణ్‌రాజ్, శంకర్‌రావు పటేల్, సునీల్ పాటిల్ పాల్గొన్నారు.

‘ప్లాంట్ ఫర్ మదర్’ కార్యక్రమం


మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రధాన మంత్రి మోదీ పిలుపు మేరకు కేంద్రీయ విద్యాలయంలో ఇకో క్లబ్స్ ఫర్ మిషన్‌లైఫ్ పథకాన్ని నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని మాచ్నూర్ శివారులో నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనం ఆవరణలో ‘ప్లాంట్ ఫర్ మదర్’ పేరుతో విద్యార్థులు తమ తల్లితో కలిసి మొక్కను నాటి నీరు పోశారు. 50మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఆగస్టు 30 వరకు 200 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనీష్‌కుమార్, ఉపాధ్యాయులు శివానంద్, హరిప్రకాశ్, మొయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం


రక్తదానం చేస్తున్న యువకులు

పటాన్‌చెరు: స్నేహితుడి వర్ధంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పెద్ద కుమారుడు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా నందిగామ గ్రామానికి చెందిన జీఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన జీఎంఆర్ యువసేన సభ్యులు, విష్ణు స్నేహితులు సుమారు వంద మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ విజయకుమార్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గూడెం విక్రమ్ రెడ్డి, లక్ష్మణ్, గోపాల్, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

హత్నూర(సంగారెడ్డి): బైక్ చోరీకి గురైన ఘటన హత్నూర మండలం బోరుపట్ల శివారులోని పరిశ్రమ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. నస్తీపూర్‌కు చెందిన మన్నే శ్రీశైలం బోరుపట్ల శివారులోని పరిశ్రమలో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం విధులు ముగించుకొని ఇంటికి వద్దామని చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సంక్షిప్త వార్తలు

◆ 29 నుంచి బస్తీబాట

జహీరాబాద్ టౌన్: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ నెల 29నుంచి బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం ఏరియా కమిటీ సభ్యుడు మహిపాల్ తెలిపారు. శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, డబుల్ బెడ్రూంల ఇళ్ల లాంటి అనేక సమస్యలతో ప్రజలు బాధలుపడుతున్నారన్నారు. సమస్యలను వెలికితీసి పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని చెప్పారు. సలీమొద్దీన్, నరేశ్, రాజు, రాజేశ్, ముత్తబీర్ పాల్గొన్నారు.

◆ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుపై విచారణ



జిన్నారం: మండలంలోని ఖాజిపల్లి శివారులోని 181 సర్వే నంబర్‌లో గల జీఎంఆర్ కాలనీలో శనివారం చైల్డ్ వెల్ఫేర్ జిల్లా అధికారి లలిత కుమారి పర్యటించారు. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పర్యవేక్షించారు. స్థానికంగా మౌలిక వసతులు కల్పిస్తే సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భార్గవ్ నాయకులు ఆంజనేయులు, కుమార్ యాదవ్, సురేశ్ పాల్గొన్నారు.

◆ పేకాట స్థావరంపై పోలీసుల దాడి

న్యాల్‌కల్ (జహీరాబాద్): మండల పరిధిలోని రాఘవపూర్‌లోని ఓ పేకాట స్థావరంపై అద్నూర్ పోలీసులు దాడిచేశారు. గ్రామానికి చెందిన రాజు నర్సింహులు, బాలయ్య, బక్కయ్య, శ్రీను, తుకారం తదితరులు శనివారం బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడిచేసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,070 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామానాయుడు తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని శనివారం కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

◆ ‘సఫాయి అప్నా.. బీమారి భగావో’

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో శనివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ‘సఫాయి అప్నా.. బీమారి భగావో’ కార్యక్రమం నిర్వహించారు. నీరు నిల్వఉన్న ప్రాంతాల్లో దోమలు ప్రభలకుండా ఆయిల్‌బాల్స్ వేశారు. వీధులు, ఖాళీ ప్రదేశాలు, రహదారులపై బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవంటూ వార్డు వాసులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారంశంకర్, కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్ వివేకానంద్, శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల్లో ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సుధాకర్ సూచించారు. శనివారం మండల పరిధిలోని కక్కర్‌వాడ గ్రామంలో ఆయన పర్యటించి, పారిశుద్ధ్యపనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ రాజ్‌కుమార్, కార్యదర్శి ఆనందం పాల్గొన్నారు.

◆ ఏఈకి వీడ్కోలు

జహీరాబాద్: ఉన్నత చదువుల కోసం వెళ్తున్న కోహీర్ ట్రాన్స్‌కో ఏఈ మనీష్‌కు ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. డివిజనల్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై తక్కువ సమయంలో అందరి మన్ననలు పొందిన మనీష్ ఉన్నత చదువులు చదివి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కె.మధుసూదన్, కె.రజనీకాంత్, ప్రశాంత్, సతీశ్, నాగరాజు, అర్జున్, జగదీశ్వర్‌రావు పాల్గొన్నారు.

◆ కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ

సంగారెడ్డి టౌన్: మార్షల్ ఆర్ట్స్‌లో అంకురం పాఠశాల విద్యార్థి బంగారు పతకం సాధించినట్లు కుంపు కరాటే మాస్టర్ పోచయ్య శనివారం తెలిపారు. ప్రతిభ కనబరిచిన ఆ విద్యార్థిని పాఠశాలలో సన్మానించారు. ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లోను రాణించేలా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ మొబైల్ ఫోన్‌లు రికవరీ

సంగారెడ్డి టౌన్: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ ద్వారా రికవరీ చేసి పట్టుకున్నామని పట్టణ పోలీసులు తెలిపారు. వాటిని శనివారం బాధితులకు అందజేశామని చెప్పారు. సెల్ఫోన్ పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

◆ విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఉర్దూ మీడియం పాఠశాలలో దాతల సహాయంతో శనివారం విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎండీ అయాజ్‌అలీ బ్యాగులు అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీచర్ ఎండీ జవీద్‌అలీ పాల్గొన్నారు.

◆ అబ్దుల్ కలాం వర్ధంతి

నారాయణఖేడ్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని నారాయణఖేడ్‌లో ప్రవాస భారతీయుడు గుర్రపు మశ్చేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని ఆక్సిజన్ పార్కులో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కల్హేర్ మాజీ ఎంపీపీ గుర్రపు సుశీల, ఖేడ్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, రవీందర్ నాయక్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ నిందితుడిని శిక్షించాలి

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్‌లో దళిత యువతి మృతికి కారణమైన నిందితుడు మహేశ్‌ను కఠినంగా శిక్షించాలని డీబీఎఫ్ బృందం శనివారం పటాన్‌చెరు డీఎస్పీ రవిందర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భగా దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన మాట్లాడుతూ గుంటూరు నగరానికి చెందిన దళిత యువతి హర్షితను గుంటూరు జిల్లా యడ్లపాడుకు చెందిన మహేశ్ కులాంతర వివాహం చేసుకొని అమీన్‌పూర్ పటేల్‌గూడలో నివాసం ఉంటూ వరకట్నం కోసం తరచూ హర్షితను వేధించేవాడన్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం హర్షిత ఉరివేసుకొని చనిపోయిందని, ఆమె మరణంపై అనుమానాలు ఉన్నా యని ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ చేపట్టి నిందితుడికి కఠిన శిక్ష పడేవిధంగా చూడాలని డీఎస్పీని కోరారు. సమావేశంలో పి.శంకర్, దాసరి ఎగొండస్వామి, రాజేందర్ పాల్గొన్నారు.

◆ రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్‌లో అధికారులు శనివారం రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు. ఏఈఓ కృష్ణవేణి మాట్లడుతూ కొత్తగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు పాసుబుక్కు, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు దరఖాస్తుకు జతచేసి అందజేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ దాడె సాయిలు, రైతులు పాల్గొన్నారు.